క్లుప్తంగా

నరసరావుపేట మండలంలో 87.03 శాతం పోలింగ్

నరసరావుపేట రూరల్: సార్వత్రిక ఎన్నికల్లో మండలంలో 87.20 శాతం పోలింగ్ నమోదు అయింది. మండలంలో మొత్తం ఓటర్లు 75,060 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 65,321 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇందులో మహిళలు అధికంగా పోలింగ్‌లో పాల్గొన్నారు. పురుషులు 36,789 మంది ఉండగా, 32,084 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. మహిళా ఓటర్లు 38,265 మంది ఉండగా 33,237 మంది ఓటు వేశారు. మండలంలోని కొత్తపాలెం గ్రామంలో ఏర్పాటు చేసిన 100వ నంబరు పోలింగ్‌బూత్‌లో అత్యధికంగా 97.35 శాతం పోలింగ్ జరిగింది. ఇక్కడ 340 ఓట్లు ఉండగా 331 ఓట్లు పోలయ్యాయి. కేసానుపల్లి పంచాయతీ పరిధిలోని ఎస్‌కేఆర్‌టీ కాలనీలో 97వ నంబరు బూత్‌లో అత్యల్పంగా 65.79 శాతం పోలింగ్ నమోదు అయింది. ఈ బూత్‌లో 605 మంది ఓటర్లు ఉండగా 398 మంది మాత్రమే తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 32 పోలింగ్ కేంద్రాల్లో 90శాతంకు పైగా ఓటింగ్ నమోదు అయింది.

గడ్డిమందు తాగి వివాహిత మృతి

యడ్లపాడు: గడ్డి మందు తాగి వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన వివరాలు.. మండలంలోని సొలస గ్రామానికి చెందిన సారెడ్డి శ్రీనివాసరెడ్డి, భారతీ దంపతులు వ్యవసాయ కూలీ పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నారు. వారికి కుమారుడు నితిన్‌రెడ్డి ఉన్నాడు. బిడ్డ చదువుకోసం అప్పులు చేశారు. అయితే కొద్దికాలం కిందట భారతీకి వెన్నుసమస్య రావడంతో ఆపరేషన్ చేయించారు. పనులు చేయలేక, అనారోగ్య సమస్యను పూర్తిగా చూపించులేక, చేసిన అప్పుల్ని తీర్చలేక పోయామని కుమారుడి ముందు బాధపడేది. ఈ నేపథ్యంలో ఈనెల 13 రాత్రి కుటుంబ సభ్యులకు భారం కాకూడదని అంతా నిద్రించాక ఇంట్లోనే గడ్డిమందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. గమనించిన కుటుంబ సభ్యులు యడ్లపాడులోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. మరుసటి రోజు ఉదయం మృతి చెందింది. మృతురాలి కుమారుడు నితిన్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ శామ్యూల్ రాజీవ్‌కుమార్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆటో బోల్తా.. పలువురికి గాయాలు



ఈపూరు: ఆటో బోల్తా పడి ఇద్దరు గాయపడిన ఘటన మండలంలోని కొండ్రముట్ల గ్రామ సమీపంలో బుధవారం చోటుచేసుకుంది. వివరాలు.. హైదరాబాద్ నుంచి పొదిలి ఆర్టీసీ బస్సు వెళ్తుండగా, బోడిపూడివారిపాలెం గ్రామం నుంచి వినుకొండ వైపునకు వెళుతున్న ఆటో క్రాస్ చేయబోయి బస్సును ఢీకొంది. ఈ ఘటనలో దారా సుజాతతో పాటు మరో వ్యక్తి గాయపడ్డారు. క్షతగాత్రులను 108లో వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

ఓటు మురిసింది.. చైతన్యం విరిసింది

- మండలం పోలింగ్ 89.4 శాతం
- పురుషుల పోలింగ్ 89.4 శాతం
- మహిళలు పోలింగ్ 89.4 శాతం



బోయపాలెంలో పోలింగ్ బూత్‌వద్ద బారులుదీరిన ఓటర్లు

యడ్లపాడు: ఓటర్లలో చైతన్యం వెల్లివిరిసింది. గతంతో పోలిస్తే ఈసారి భారీగా ఓటింగ్ శాతం నమోదైంది. ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా భావించిన రాజకీయ పక్షాల పిలుపు ఒకవైపు.. ఎన్నికల సంఘం నిర్వహించిన ప్రచారం మరోవైపు పోలింగ్ పెరుగుదలకు దోహదపడ్డాయి. నియోజకవర్గం పరిధిలో ఎమ్మెల్యే పోటీ బరిలో 25 మంది అభ్యర్థులు ఉన్నప్పటికీ ప్రధానంగా పేదల పక్షాన నిలిచి న వైఎస్సార్ సీపీ, పెత్తందార్ల పక్షాన ఉన్న కూటమి పార్టీల మధ్యనే పోటీ జరిగింది. వేకువజామునే పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు బారులుదీరినప్పటికీ.. సాంకేతిక కారణాలతో ఈవీఎంలు పనిచేయకపోవడం, ఎండ తీవ్రత తదితర కారణాలతో పో లింగ్ సరళి ఉదయం మందకోడిగా సాగినా సా యంత్రానికి క్యూలు కిక్కిరిసి అర్ధరాత్రి వరకు జరిగింది. మండుటెండను లెక్కచేయక వృద్ధులు, వికలాంగులు పోలింగ్ బూత్‌లకు వచ్చి ఓటు హక్కు వినియోగించుకున్నారు. విద్యా, ఉద్యోగం, ఉపాధి పనులపై సుదూర ప్రాంతాల్లో ఉన్నవారు తరలివచ్చారు. ఇతర జిల్లాలు, పలు రాష్ట్రాల నుంచే కా కుండా అమెరికా వంటి అగ్రదేశాల్లోని వారు రావ డం గమనార్హం. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్ర తి ఇంటికి సంక్షేమ పథకాలు అమలు చేయడంతో ఈ ఎన్నికల్లో పాజిటివ్ ఓటింగ్ భారీగా నమోదై మరోసారి వైఎస్సార్ సీపీ విజయం సాధించబోతుందని అందుకు మహిళల సైలెంట్ ఓటింగ్ సాక్ష్య మని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

అన్నింటా 89.4 శాతమే...

పల్నాడు పార్లమెంట్ పరిధిలోని చిలకలూరిపేట అసెంబ్లీ సెగ్మెంట్‌లోని యడ్లపాడు మండలంలో 18 పంచాయతీలు, 22 గ్రామాలు ఉన్నాయి. మండలంలో 44,381 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 21,393 మంది పురుషులు, 22,988 మహిళలు ఉన్నారు. సోమవారం జరిగిన 4వ విడత సార్వత్రిక ఎన్నికల్లో 39,708 మంది తమ ఓటుహక్కును వినియో గించుకున్నారు. వీరిలో 19,134 మంది పురుషులు, 20,574 మంది మహిళలు పోలింగ్‌లో పాల్గొన్నారు. మండలంలో అత్యధికంగా మైదవోలులోని 73వ బూత్‌లో 96.5శాతం, అత్యల్పంగా ఉప్పరపాలెం గ్రామంలోని 78వ పోలింగ్ బూత్‌లో 76.6శాతం పోలింగ్ నమోదైంది. మండలంలోని 57 పోలింగ్ బూత్‌లలో 90శాతానికి పైగా 29 బూత్‌లు, 80శాతంపైగా 25, 70శాతానికిపైగా వచ్చిన పోలింగ్‌బూత్‌లు 3 ఉన్నాయి. దీంతో మండల పోలింగ్‌శాతం, పురుషులు ఓటింగ్, స్త్రీల ఓటింగ్ ఏదైనా 89.4 శాతంగా నమోదు కావడం విశేషం. గ్రామాలు, వార్డుల వారీగా పోలింగ్ వివరాలు..

బూత్	గ్రామం	మొత్తం ఓటర్లు	పొలైన ఓట్లు	శాతం
58	కొత్తపాలెం	1123	1049	93.4
59	కొండవీడు	911	843	92.5
60	కొండవీడు	912	853	93.5
61	కోట	665	601	90.3
62	చెంఘీజ్‌ఖాన్‌పేట	697	946	92.6
63	చెంఘీజ్‌ఖాన్‌పేట	806	729	90.4
64	చెంఘీజ్‌ఖాన్‌పేట	1077	907	84.2
65	సొలస	685	626	91.3
66	సొలస	627	589	93.9
67	సొలస	955	848	88.7
68	సొలస	859	777	90.4
69	లింగారావుపాలెం	733	691	94.2
70	లింగారావుపాలెం	773	696	88.5
71	లింగారావుపాలెం	595	510	85.7
72	లింగారావుపాలెం	640	577	90.1
73	మైదవోలు	689	665	96.5
74	మైదవోలు	1150	1090	94.7
75	వంకాయలపాడు	683	648	94.8
76	వంకాయలపాడు	792	745	94.0

బూత్	గ్రామం	మొత్తం ఓటర్లు	పొలైన ఓట్లు	శాతం
77	ఉప్పరపాలెం	761	712	93.5
78	ఉప్పరపాలెం	728	558	76.6
79	బోయపాలెం	983	894	90.9
80	బోయపాలెం	742	613	82.6
81	ఉన్నవ	736	684	92.9
82	ఉన్నవ	765	701	91.6
83	ఉన్నవ	652	593	90.6
84	ఉన్నవ	747	663	88.7
85	మర్రిపాలెం	1078	973	90.2
86	మర్రిపాలెం	408	368	90.1
87	యడ్లపాడు	708	634	89.5
88	యడ్లపాడు	675	568	84.1
89	యడ్లపాడు	702	606	86.3
90	యడ్లపాడు	752	586	77.9
91	యడ్లపాడు	739	670	90.6
92	యడ్లపాడు	1021	880	86.1
93	యడ్లపాడు	811	712	87.7
94	యడ్లపాడు	725	631	87.0
95	యడ్లపాడు	1055	999	94.6

బూత్	గ్రామం	మొత్తం ఓటర్లు	పొలైన ఓట్లు	శాతం
96	దింతెనపాడు	523	441	84.3
97	దింతెనపాడు	417	380	91.1
98	తిమ్మాపురం	831	708	85.1
99	తిమ్మాపురం	749	656	87.5
100	తిమ్మాపురం	664	552	83.1
101	తిమ్మాపురం	904	761	84.1
102	తిమ్మాపురం	666	538	80.7
103	తిమ్మాపురం	635	601	94.6
104	జగ్గాపురం	965	830	86.0
105	జగ్గాపురం	929	835	89.8
106	జాలాది	808	713	88.2
107	జాలాది	860	824	95.8
108	కారుచోల	997	929	93.1
109	కారుచోల	1191	1113	93.4
110	గుత్తావారిపాలెం	269	211	78.4
111	తుర్లపాడు	738	631	85.5
112	తుర్లపాడు	757	679	89.6
113	సందెపూడి	712	640	89.1
114	సందెపూడి	706	633	89.6

ప్రజలు సహకరించాలి

- అమలులో 144 సెక్షన్
- వినుకొండ రూరల్ సీఐ సుధాకర్



శావల్యాపురం: జిల్లా కలెక్టరు ఆదేశాలు మేరకు వినుకొండ రూరల్ పరిధి నాలుగు మండలాల్లో 144 సెక్షన్ అమల్లో ఉందని వినుకొండ రూరల్ సీఐ ఉప్పుటూరి సుధాకర్ తెలిపారు. బుధవారం స్థానిక పోలీసు స్టేషను సీఐ తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల కమిషనర్ ఆదేశాలు మేరకు 144 సెక్షన్ అమల్లో ఉన్నందున ప్రజలు గుంపులుగా ఉండరాదన్నారు. హింసాత్మక ఘటనలకు తావు లేకుండా ప్రజలందరు అన్నీ పార్టీల నాయకులు సహకరించాలని కోరారు. గ్రామాల్లో పోలీసులు ప్రత్యేక నిఘాతో పాటు మైకుల ద్వారా ప్రచారం చేస్తున్నట్లు చెప్పారు. రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయటంతో పాటు గొడవలు అల్లర్లుకు పాల్పడే వారిపై కఠిన చర్యలతో పాటు కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఎస్‌ఐ చల్లా సురేష్ ఉన్నారు.

టీడీపీ దాడిలో వైఎస్సార్ సీపీ కార్యకర్తలకు గాయాలు

పిడుగురాళ్లరూరల్: ఎన్నికలు ముగిసినా కూడా టీడీపీ అల్లరి మూకలు గొడవలు సృష్టిస్తూనే ఉన్నారు. ఎన్నికల్లో మండలంలోని బ్రాహ్మణపల్లికి చెందిన బత్తుల నాగరాజు వైఎస్సార్ సీపీ తరఫున ఏజెంట్‌గా పనిచేయగా, టీడీపీ నేతలు కొందరు అతనితో ఘర్షణ పడ్డారు. అయితే బత్తుల నాగరాజుకు వెంకయ్య, విజేయంద్రబాబులు అండగా నిలిచి, అతని తరఫున మాట్లాడారు. దీన్ని మనసులో పెట్టుకున్న టీడీపీ నాయకులు వారి ఇళ్లపై దాడి చేశారు. ఈ దాడుల్లో వెంకయ్య, విజేయంద్రబాబుకు గాయాలయ్యాయి. వీరికి గురజాల ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స అందిస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

సత్తెనపల్లిలో 144 సెక్షన్ అమలు



పట్టణంలో హెచ్చరికలు చేస్తున్న ఎస్‌ఐ సంధ్యారాణి

సత్తెనపల్లి: సార్వత్రిక ఎన్నికల అనంతరం చోటు చేసుకుంటున్న అల్లర్ల నేపథ్యంలో పట్టణం, మండలంలో 144 సెక్షన్, 30 పోలీస్ యాక్ట్ అమలు చేస్తున్నట్లు పట్టణ సీఐ పోలూరి శ్రీనివాసరావు, సత్తెనపల్లి రూరల్ సీఐ ఎం.రాజేష్‌కుమార్ అన్నారు. అత్యవసర పనులు ఉంటే తప్ప అనవసరంగా రోడ్లపై తిరగవద్దని, ముగ్గురుకు మించి గుంపు కూడా కూడవద్దని హెచ్చరికలు చేశారు. దీంతో పట్టణంలో చాలా వరకు దుకాణాలు సైతం మూతపడ్డాయి. ఎక్కడైనా అవాంఛనీయ సంఘటనలు జరిగితే వాటికి దూరంగా ఉండాలన్నారు. పోలీసులకు సహకరించాలని కోరారు. పట్టణ ఎస్‌ఐలు ఎం.సంధ్యారాణి, ఎం.సత్యనారాయణ, సిబ్బంది, తదితరులు ఉన్నారు.

గ్రామాల్లో పోలీస్ పికెట్

ముప్పాళ్ల: శాంతి భద్రతల దృష్ట్యా మండలంలోని మాదల, తొండపి గ్రామాల్లో రెండవ రోజు పోలీస్ పికెట్ కొనసాగినట్లు ఎస్‌ఐ పి.హజరతయ్య బుధవారం తెలిపారు. టీడీపీ, వైఎస్సార్ సీపీ వర్గీయుల మధ్య నెలకొన్న ఘర్షణ నేపథ్యంలో, శాంతిభద్రతల దృష్ట్యా ఆయా గ్రామాల్లో పోలీస్ పికెట్ ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. ఎన్నికల నేపథ్యంలో జరిగిన ఘర్షణలపై కేసులు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. తొండపి గ్రామంలో పరస్పర రాళ్ల దాడిపై రెండు కేసులు, నార్నెపాడులో వైఎస్సార్ సీపీ చీఫ్ ఏజెంట్ ఉపేష్‌చౌదరి కారుపై టీడీపీకి చెందిన రాయపాటి సైదారావుతో పాటుగా మరో 10మంది కలిసి దాడి చేసి కారు అద్దాలు ధ్వంసం చేసిన సంఘటనపై అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయటం జరిగిందన్నారు. అలాగే లంకెలకూరపాడు గ్రామంలో టీడీపీ నాయకుడు బత్తుల నాగేశ్వరరావుకు చెందిన కారుపై దాడిచేయడంపై నాగేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయటం జరిగిందన్నారు. అలాగే మండల కేంద్రమైన ముప్పాళ్ళలోని ఆర్‌సీఎం స్కూల్‌లోని పోలింగ్ కేంద్రంలో జరిగిన ఘర్షణపై కేసు నమోదు చేయటం జరిగిందన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలో 144 సెక్షన్ అమలులో ఉన్నట్లు, ముగ్గురు వ్యక్తులు ఒక చోట చేరి గుంపుగా గుమికూడి ఉండరాదన్నారు. ఎవరైనా పోలీసు ఆంక్షలు ఉల్లంఘించేలా ప్రవర్తిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

బోయపాలెంలో బ్రహ్మంగారి ఆరాధనోత్సవాలు



యడ్లపాడు: మండలం బోయపాలెంలోని గోవిందమాంబ సమేత శ్రీమద్విరాట్ పోతులూరి వీర బ్రహ్మేంద్రస్వామి దేవస్థానంలో స్వామి ఆరాధానోత్సవాలు మంగళవారం నుంచి ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా పోలేరమ్మ అమ్మవారికి భక్తులు పొంగళ్లు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. మధ్యాహ్నం స్వామి శాంతి కల్యాణం కన్నుల పండుగలా నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధానార్చకులు కనగాల వసంతాచార్యులు మాట్లాడుతూ ఈనెల 17వ తేదీ శుక్రవారం ఆరాధన ఉత్సవం ఉంటుందన్నారు. అనంతరం గ్రామస్తులందరికీ అన్నదానం చేయనున్నట్లు వెల్లడించారు. దాతలు, గ్రామపెద్దల సహకారంతో జరిగే ఆధ్యాత్మిక కార్యక్రమానికి అధిక సంఖ్యలో భక్తులు హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో కనగాల మురళి, శ్రీనివాస నాయక్ ఉన్నారు.

కొత్తగణేశునిపాడు ఘటనపై ఇరువర్గాలపై కేసు నమోదు

మాచవరం: మండలంలోని కొత్తగణేశునిపాడు గ్రామంలో సోమవారం రాత్రి జరిగిన విధ్వంస ఘటనపై టీడీపీకి చెందిన 10 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ అమీనుద్దీన్ తెలిపారు. పోలింగ్ ముగిసిన తర్వాత గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు, రౌడీ మూకలు గ్రామంలోని వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలపై దాడులు చేసి, సానుభూతి పరులు ఇళ్లను, ద్విచక్రవాహనాలను, ఇళ్లలోని వస్తువులను ధ్వంసం చేసిన ఘటనపై వైఎస్సార్ సీపీ గ్రామ నాయకుడు చల్లగుండ్ల రాంబాబు ఫిర్యాదు మేరకు టీడీపీకి చెందిన 10 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

- అదేవిధంగా తమ వర్గీయులకు చెందిన ఇళ్లపై రాళ్లు విసిరి ధ్వంసం చేసేందుకు ప్రయత్నించారన్న టీడీపీ చెందిన చల్లగండ్ల సాంబశివరావు ఫిర్యాదు మేరకు వైఎస్సార్ సీపీకి చెందిన 10 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



అప్పటి ఉపాధ్యాయులతో విద్యార్థిని, విద్యార్థులు

రొంపిచర్ల: పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఉత్సాహంగా జరిగింది. మండలంలోని వి.రెడ్డిపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 2009–2010లో 10వ తరగతి విద్యనభ్యసించిన విద్యార్థులు పాఠశాలలో బుధవారం సమావేశం అయ్యారు.వ నాటి రోజుల్లో నేడు పాఠశాల అభివృద్ధి చెందిన విధానంపై కూడా చర్చించుకున్నారు. అప్పటి కన్నా పాఠశాలలో ప్రస్తుతం ఎక్కువ సౌకర్యాలు ఉన్నాయి. అదనపు తరగతి గదులు, ప్రయోగశాలలు, డిజిటల క్లాస్ రూమ్‌లను చూసి సంతోషపడ్డారు. వారికి విద్యా బోధనలు చేసిన గురువులు బండి రాము, ఖాన్, దుర్గాప్రసాద్, సత్యనారాయణ, రమేష్‌బాబు, కాసు జోగిరెడ్డి, వోబయ్య, వెంకటేశ్వరరావు, యన్నపూస వక్కిరెడ్డి, రాజేశ్వరి, ఇందిర, బాజి, సుభాని, విజయభాస్కర్‌లను విద్యార్థులు ఘనంగా సన్మానించారు. 14 ఏళ్ల తర్వాత విద్యార్థులు వారు చదివిన పాఠశాలలో కల్సుకోవటంతో వారి ఆనందానికి అవధులు లేవు. వారు ఎక్కడెక్కడ ఉంటున్నారు. ఏమేమి చేస్తున్నారో కూడా తెల్సుకుంటూ కుటుంబ విశేషాలను కూడా ఒకరినొకరు పంచుకున్నారు. సమ్మేళనానికి గుర్తుగా మెమొంటోలను పంపిణీ చేశారు. విందు ఏర్పాటు చేశారు. పాఠశాల అభివృద్ధికి తమ వంతు సహాయ సహకారాలను అందించాలని సమావేశంలో నిర్ణయించారు.

హక్కులను కాపాడడమే లక్ష్యం

రాజుపాలెం: రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కుల ఉల్లంఘనలు, చట్టవిరుద్ధమైన కార్యకలాపాలు, పొగాకు, మత్తుపదార్థాల వినియోగం నుంచి ప్రజలకు విముక్తి కలిగించేందుకు తమ సంస్థ పనిచేస్తుందని నేషనల్ యాంటీ క్రైమ్ హ్యూమన్ రైట్స్ ఆఫ్ ఇండియా సంస్థ జాతీయ వ్యవస్థాపక అధ్యక్షుడు జాన్ శ్యామ్యూల్ కిమ్ అన్నారు. మండలంలోని కొండమోడు గ్రామంలో గల దీనమ్మ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆవరణలో పల్నాడు జిల్లాశాఖ అధ్యక్షుడు గరికపాటి శంకరరావు అధ్యక్షతన నేషనల్ యాంటీ క్రైమ్ హ్యూమన్ రైట్స్ ఆఫ్ ఇండియా సంస్థ ఆధ్వర్యంలో బుధవారం అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా 20 రాష్ట్రాలలో తమ సంస్థ విస్తృతంగా పనిచేస్తుందన్నారు. పల్నాడులో మైనర్ల హక్కులను కాపాడేందుకు పనిచేస్తున్నట్లు తెలిపారు. సంస్థ 19వ వార్షికోత్సవం పురస్కరించుకొని ఆశ్రమంలోని చిన్నారులకు, వృద్ధులకు, అనాథలకు దుస్తులు, దుప్పట్లు పంపిణీ చేశారు. హ్యూమన్‌రైట్స్ సేవలను అందిస్తున్న మేధావులకు జాతీయ పురస్కారాలు అందజేశారు. కార్యక్రమంలో విశిష్ట అతిథిగా రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు మూర్తి, వెంకటపతిరాజు, ఉపాధ్యక్షుడు కోడిరెక్క కుమార్, కార్యదర్శి కోనేటి నర్సింహారావు, కోటా బాబూరావు, కాకుమాను శ్రీనివాసరావు, మల్లిఖార్జునరావు, వరప్రసాద్, వై.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆర్థికసాయం

క్రోసూరు: తమతో పాటు చదువుకున్న స్నేహితుల కుటుంబాలకు పూర్వ విద్యార్థులు బుధవారం ఆర్థిక సహాయం అందచేశారు. క్రోసూ రు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో పదవ తరగతి 1991–92 బ్యాచ్ విద్యార్థులు తమ స్నేహితుడైన 88త్యాళ్లూరు గ్రామానికి చెందిన మేదర కోటేశ్వరరావు కుమార్తె వివాహం నిమిత్తం రూ.23,500, అదేవిధంగా తమ స్నేహితుడు ఈగా శ్రీనివాసరావు ఇటీవల మృతి చెందగా అతని కుమార్తె శ్రావణికి బ్యాంక్ కోచింగ్ నిమి త్తం రూ.50 వేలు ఆర్థికసాయం. అదేవిధంగా అచ్చంపేట మండలం వేల్పూరు గ్రామానికి చెందిన వాసా అశ్విని అనే విదార్థినికి రూ.5వేలు అందచేశారు. ఈకార్యక్రమంలో 91–92 బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఎస్ఆర్‌వీ ప్రసాద్(ఎన్ఆర్ఐ), జువ్వా వెంకటరమణ(ఎన్ఆర్ఐ), తమ్మా భాస్కర్ (డీప్యూటీ సీటీఓ), ములుగూరి రాజారావు, ఎండీ రఫీ, ఖాదర్‌వలి, కె.అచ్యుత్ తదితరులు పాల్గొన్నారు.

నిర్మానుష్యం.. ఇళ్లకే పరిమితం

- పిడుగురాళ్ల పట్టణంలో 144 సెక్షన్
- దుకాణాలు మూసేసిన వ్యాపారులు
- పట్టణంలో పోలీసుల ప్రచారం



నిర్మానుష్యంగా ఉన్న పిడుగురాళ్ల ప్రధాన రహదారి

పిడుగురాళ్ల: పల్నాడు జిల్లాల్లో పలు ప్రాంతాల్లో అల్లర్లు, గొడవలు జరగడంతో పల్నాడు జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు పిడుగురాళ్ల పట్టణంలో బుధవారం నుంచి 144 సెక్షన్ అమలు చేశారు. దీంతో పట్టణంలోని వ్యాపార దుకాణాలన్ని బంద్ చేయాలని, పోలీసులు హెచ్చరికలు చేయటంతోపాటు, ఆటోలో ప్రత్యేకించి పోలీస్ సిబ్బంది ప్రచారం చేశారు. దీంతో వ్యాపారస్తులందరు దుకాణాలన్ని బంద్ చేశారు. సార్వత్రిక ఎన్నికలు ముగిసి రెండు రోజులు అవుతున్నప్పటికీ టీడీపీ నాయకులు గొడవలకు దిగుతున్నారు. వైఎస్సార్ సీపీ నాయకులను టార్గెట్‌గా చేసుకుని దాడులకు పాల్పడుతున్నారు. దీంతో పల్నాడు ప్రాంతంలో 144 సెక్షన్‌ను జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్నారు. వరుసగా మూడు రోజుల పాటు 144 సెక్షన్ అమలులో ఉంటుందని పోలీసులు తెలిపారు.

గురజాలలోనూ..

గురజాల: గురజాల మండలంలో 144 సెక్షన్ అమలు చేయడం జరిగిందని సీఐ టి.బాలకృష్ణ తెలిపారు. ఈ నెల 13వ తేదీన జరిగిన సార్వత్రిక ఎన్నికలను పురస్కరించుకుని జరుగుతున్న ఇరు పార్టీల కొట్లాటలను, గొడవలను దృష్టిలో ఉంచుకుని 144 సెక్షన్ అమలు చేయడం జరిగిందన్నారు. ముగ్గురికి మించి ఎవరూ గుంపులుగా ఉండరాదన్నారు. టీ స్టాల్స్‌లో గుంపులుగా నిలబడటం, హోటళ్లలో గుంపులుగా ఉండటం వంటివి చేయరాదన్నారు. ఎవరైనా శాంతిభద్రతలకు ఆటంకం కలిగిస్తే వారిని ఉపేక్షించేది లేదన్నారు. ఎస్‌ఐలు బి.అనంత కృష్ణ తదితరులున్నారు.

ఎక్కడికక్కడ వాహనాలు తనిఖీ

మాచర్ల: మాచర్ల నియోజక వర్గంలో శాంతిభద్రతల దృష్ట్యా బుధవారం తెల్లవారుజాము నుంచి రాత్రి వరకు వాహనాలు తనిఖీ చేశారు. నియోజకవర్గంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకున్నారు. రాయవరం జంక్షన్, రింగురోడ్డు, జమ్మలమడక ఆయా మండలాల సరిహద్దు ప్రాంతాలలో జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో తనిఖీలు చేసి పూర్తి చర్యలు తీసుకున్నారు.

మండలంలో...

పిడుగురాళ్లరూరల్: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో అల్లర్లు జరగకుండా మండలంలోని పలు గ్రామాల్లో 144 సెక్షన్ అమలు చేశారు. కలెక్టర్ ఆదేశాల ప్రకారం... పట్టణ సీఐ ఆంజనేయులు పలు గ్రామాలను సందర్శించి 144 అమలును పర్యవేక్షించారు. మండలంలోని బ్రాహ్మణపల్లి, గుత్తికొండ, జానపాడు, తుమ్మలచెరువు, కరాలపాడు, జూలకల్లు వంటి గ్రామాల్లో 144 సెక్షన్ ఆంక్షలు విధించారు. కిరాణాదుకాణాలు, పలు దుకాణాలను మూసివేయించారు. ఇద్దరికంటే ఎక్కువ మంది గుమికూడితే వారిని అరెస్టు చేస్తామని తెలిపారు.

గ్రామాలలో పోలీసు బందోబస్తు

మాచర్ల రూరల్: పోలింగ్ రోజున గ్రామాలలో ఏర్పడ్డ ఘర్షణలను నివారించేందుకు పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశామని రూరల్ ఎస్‌ఐ రాజశేఖర్ పేర్కొన్నారు. సమస్యాత్మక గ్రామాలైన కంభంపాడు, రాయవరం, గన్నవరం, జమ్మలమడక గ్రామాలలో ఆయుధాలతో కూడిన పోలింగ్ బందోబస్తు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. గ్రామాలలో ఎటువంటి సంఘటనలు జరగకుండా ఇరువర్గాలను అదుపులోకి తీసుకొని బైండోవర్ కేసులు నమోదు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు ..

పిడుగురాళ్ల: పల్నాడు జిల్లాలో గత రెండు రోజుల నుంచి జరుగుతున్న హింసాత్మక ఘటనల నేపథ్యంలో జిల్లా అధికారుల ఆదేశాల మేరకు పిడుగురాళ్ల పట్టణ, మండలాల్లో 144 సెక్షన్ అమలులో ఉందని తెలిపారు. పట్టణంలోని 144 సెక్షన్ మూడు రోజుల పాటు అమలు ఉందని పట్టణ సీఐ పీవీ ఆంజనేయులు బుధవారం తెలిపారు. పల్నాడు జిల్లాలో సార్వత్రిక ఎన్నికల తర్వాత జరిగిన పరిణామాల దృష్ట్యా ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు పిడుగురాళ్ల పట్టణంలో మూడు రోజుల పాటు 144 సెక్షన్ అమలులో ఉంటుందని, వ్యాపార సంస్థలు బంద్ చేయాలని, పట్టణ ప్రధాన కూడల్లో నలుగురికి మంచి ఎక్కువ మంది ప్రజలు తిరగరాదని హెచ్చరించారు. సామాజిక మాధ్యమాల్లో సైతం రాజకీయ పార్టీలకు సంబంధించిన వారు రెచ్చగొట్టే విధంగా ఎలాంటి మేసేజ్‌లు పోస్టులు చేయరాదని తెలిపారు. ప్రజలను రెచ్చగొట్టే విధంగా చేసిన వారిపై కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవటం జరుగుతుందని తెలిపారు.

ఘనంగా స్వప్రకాష్ గురూజీ ఆరాధన ఉత్సవం



సత్తెనపల్లి: పట్టణంలోని గుంటూరు రోడ్డులో గల సనారీ వీరబ్రహ్మేంద్ర ఆశ్రమ వ్యవస్థాపక నిర్మాణ ధర్మకర్త, మఠాధిపతులు బ్రహ్మశ్రీ చింతాడ స్వప్రకాష్ గురూజీ 34వ ఆరాధన ఉత్సవాన్ని బుధవారం ఆశ్రమంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం గురూజీకి శిష్యులు గురుపూజోత్సవ నిర్వహించారు. అనంతరం లక్ష మల్లెల అర్చన, మంత్రపుష్పం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించి భక్తులకు, శిష్యులకు తీర్థ ప్రసాదాలు అందించారు. ఈ సంవత్సరం గురూజీ 34వ ఆరాధనోత్సవం సందర్భంగా ఆశ్రమ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న సీఎస్‌జీఎల్‌ఎం జూనియర్ కళాశాలలో 25 మంది పేద విద్యార్థులకు ఉచితంగా ఇంటర్మీడియట్ విద్యను అందించనున్నట్లు ఆశ్రమ ధర్మకర్త, ప్రస్తుత మఠాధిపతులు చింతాడ లలితాంబ మాతాజీ తెలిపారు. పేద విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.